జ్యోతి చిన్నకథల పోటీలలో గెలుపొందిన కథ

# దిల్ ఏక్ మందిర్

## శ్రీమతి లక్ష్మి

భోగ లాలసత్వానికి, సమస్త సుఖాలకీ ఆదిమూలం డబ్బు. అది ఉంటే ప్రపంచంలో చాలా వినోదాలూ, విశేషాలూ, అనేక రకాల పాత్రలూ ఆనందించగల సమర్థులు డబ్బుకి దాసోహం అంటారు.

డబ్బులేని వాడికి ఈ ప్రాపంచికపు మాతాలపైన మోజు కల్గిందో, పిచ్చివాడికి కల్లు తాగించి అమ్మవారి జాతరలో విడిచి నట్టుంటుంది. ఆ సమయంలో వాడి చేష్టలు సరిదిద్దామనుకోవడం సాహసమే కదా!

మత్తువదిలి తన ఉనికి తెలిసి, చేసిన పని సరియైనది కాదని పశ్చాత్తాపపడి, అతి అపురూపమైన కోమలి, సౌందర్యరాశి ప్రేమతో శాసించి తన హృదయ సామ్రాజ్యాన్ని దివ్యమైన హుందాతో ఏలే మహా మహారాణి తన భార్య సుశీల, తనబంగారు చిన్నారులిద్దరూ గుర్తుకొచ్చి క్షణికమైన సుఖాలకు బానిసై, బలహీనతకి వోడి పోయి, ఎన్నోసార్లుచేసిన వాగ్దానాలు నిలుపుకోలేక పోతున్నందుకు సిగ్గుపడి విరక్తితో మమత, మానవత్వం ముందు తల ఒగ్గి ఇంటి నించి వెళ్ళిపోయాడు సుశీల భర్త రావ్.

* * *

రావ్‌కి శేఖర్ అనే డాక్టర్ స్నేహితుడున్నాడు. అతనిదొక వింత మనస్తత్వం.

మనిషి, అతనికి వచ్చే బాహ్య రోగాలు ఉద్రేకాలు, నివారణోపాయాలూ అతనికి తెలుసు. మనిషి మనస్సు, మమత, శాశ్వతమైన మానవత్వంకోసం అతని అన్వేషణ ఈ అన్వేషణలో అతను ఇరుకు సందులకీ వెళ్ళాడు. రాజమార్గాలూ చూశాడు మురికి గోడల పూరిగుడిసెలూ, దేవేంద్ర వైభవాన్ని ఊహకి తెచ్చే విశ్రాంతి భవనాలూ అతని అన్వేషణలో ఉన్నాయి. తన పర భేదం లేకుండా, చేతనైన సహాయం చేస్తూ, సేవలు చేస్తూ, వయస్సు బాహ్య సౌందర్యం కప్పే పొరల్లో మునిగి పోకుండా, అతి నిర్లిప్తంగా, జీవితాన్ని గడుపుతున్న రోజుల్లో చిన్ననాటి స్నేహి

తుడు రావ్ తారసపడేసరికి, మండుటెండలో దాహంతో పోతున్న వాడికి మంచి నీరు దొరికి నట్టయింది శేఖర్‌కి. అతనిలో అంతర్గతంగా ఉన్న అన్వేషణకి, చిక్కు సమస్యలకి సుశీల వ్యక్తిత్వంలో సమాధానాలు దొరికాయి. అందుచేత డాక్టర్ ఆమెని ఉన్నత వ్యక్తిగా ఆరాధిస్తాడు. ఆమె వ్యక్తిత్వం కోసం, అభిమానించే స్నేహితుడికోసం తన సర్వస్వాన్నీ అర్పించడానికి సిద్ధపడ్డాడు-ఒంటరివాడు, నా అనే పూచీ లేని డాక్టర్.

* * *

సుశీల సార్థక నామధేయ. ఎన్ని కష్టాలైనా ఓర్పుతో, చిరునవ్వుతో స్వీకరించి కర్తవ్య నిర్వహణ కోసం ముందంజ వేయగల సహనశాలి. దుఃఖ జీవుల పాలిటి దయామయి. కామాంధకారుల పాలిటి కాలనాగు: గృహిణిగా, తల్లిగా ప్రేమమయి, అనురాగమయి. సుఖశాంతులకు ఆవాసనిలయం. ఎన్నికష్టాలైనా భరించి పిల్లలకు విద్యా బుద్ధులు చెప్పించి, చక్కని భావి పౌరులుగా తీర్చి దిద్దడమే ఆమె ధ్యేయం. ఇటువంటి మహాసాధ్వి ఐన సుశీలకు ముఖం చూపించడానికి సిగ్గుపడి వెళ్ళిపోయాడు ఆమె భర్త.

సుశీల తన భావాలకూ, ఆశయాలకూ, నమ్మకాలకూ వ్యతిరేకమైన పరిస్థితుల నెదుర్కోవలసి వచ్చినందుకు భయపడదు. ప్రపంచమెన్ని కారు కూతలు కూసినా తన మనస్సుకు నచ్చిన పని చెయ్యడంలో ఆమె ఎన్నడూ సంకోచించదు. పరిస్థితుల కనుకూలంగా తన మనస్తత్వాన్నే మల్చుకున్న కార్యశీలి-సుశీల.

అందువల్లనే తన హృదయాన్ని చూసి జాలిపడిందికాని, విరక్తి చెందలేదు మమత అప్యాయత, మానవత్వం మీద సంపూర్ణ నమ్మకం ఉన్నది గనుకనే తన భర్త ఏనాటికైనా తిరిగి వస్తాడనే ఆశతో నిరీక్షిస్తూంది.

* * *

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలూ గడిచిపోతున్నాయి. కాని సుశీల భర్త తిరిగి రాలేదు. రాత్రనక, పగలనక శ్రమించి బిడ్డలను పోషించుకుంటూ,వారికి విద్యాబుద్ధులు చెప్పిస్తూంది. అభిమానవతి. అబలఐన సుశీల శేఖర్ సహాయాన్నికాదవ లేక, అంగీకరించలేక కొట్టు మిట్టాడుతూంది. శేఖర్ సహృదయం ఆమెకు తెల్సు' సంఘం దృష్టిలో ఆ సహాయానికి అర్థం ఏమిటో కూడా ఆమెకు తెల్సు. కాని ఆమె ధ్యేయం ముందు సంఘానికీ, వ్యర్థమైన మాటలకీ విలువ ఇవ్వ దల్చుకోలేదు.

ప్రపంచంలో ప్రతి స్త్రీ కోరుకొనే అందం, వయస్సు సుశీల పాలిట శత్రువులే అయ్యాయి.

* * *

రావ్‌ని వెదకడంలో ఎంతో డబ్బు ఖర్చు చేసివిసిగి వేసారిపోయాడు శేఖర్. అతని జాడ తెలియలేదు. చేసే సహాయా

నికి ప్రతిఫలంగా సమాజం విసిరే రాళ్ళు హృదయానికి తగిలి, గాయపడి అబ్బా! అని ఆవేదనతో మూలిగినప్పుడు, ఆబాధను భరించలేక ఒళ్లు తెలియని మత్తులో, మగత లోనూ సంఘం కట్టుబాట్లలోని స్త్రీని చూసి నవ్వుకొనే వాడు తనలో!

* * *

ధనవంతురాలయిన స్త్రీ సమాజంలో పతివ్రతగా గుర్తింప బడుతుంది. డబ్బు, హోదా, కపటంతో కూడిన స్వార్థపరమైన వ్యక్తులు సంఘ సంస్కర్తలు భయపడే వాళ్ళని బెదిరించడం, ఎదురు తిరిగిన వాళ్ళని చెడిపోయిన వారిగా ఏరి పారె య్యడం, నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నిరూపించడం ఒక స్త్రీకి కనీస మానవ ధర్మంగా సహాయపడే వాళ్ళని పతి తులనడం నవసమాజపు లక్షణాలు.

"ఈ శుష్క ప్రపంచానికి, మానవాళికీ అందని ఏ సుదీర్ఘ తీరాలకో పోవాలనిపి స్తుంది. కాని యిద్దరం వెళ్తే ఎలా? పోనీ వారైనా సుఖంగా ఎక్కడో ఒక చోట ఉంటే చాలు" అనుకునేది సుశీల.

* * *

పెద్ద మనిషిగా చెలామణీ అవుతున్న ఒక సంఘ సంస్కర్త చేత మోసగింప బడి, 'ఇదేనా న్యాయం?' అని అడిగి నందుకు ఆయన ఆగ్రహావేశాలకు గురి అయి చావు బ్రతుకులలో ఒక అనాధ శేఖర్ హాస్పిటల్ కి వచ్చింది. ఆఖరి క్షణంలో జరి గిన దంతా డాక్టర్ తో చెప్పి ప్రాణం విడి చింది. ఈ విషయం బయటికి పొక్క కుండా ఉండేందుకు డాక్టర్ని డబ్బుతో తూచబోయాడు పెద్దమనిషి. అందుకు అంగీకరించని శేఖర్ చాలా దారుణమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. పెద్ద మనిషి చాలా ముఠాలకి నాయకుడు. కొన్ని కొన్ని ముఖ్యమైన పనులకి పైగ్రామల లోని తన ముఠా వ్యక్తుల్ని రప్పించి అక్కడ కార్యక్రమం జరిపించేవాడు.

ఇంటినుండి వెళ్ళిపోయిన రావ్ కష్ట పడి పనిచేయడానికి పని దొరకలేదు. నీతి, న్యాయం మొదలైన ధర్మపన్నాలు పాటించడానికి పరిస్థితులు ఎప్పుడూ అను కూలించలేదు. అందుకే అతను అవి నీతికి అలవాటు పడ్డాడు. ఆదరంగా ఆహ్వా నించిన ముఠాలో చేరిపోయాడు. హాయిగా అతని అవసరాలు గడిచిపోతున్నాయి. న్యాయం, ధర్మం అనే వాటి ఉనికినే అతను మర్చిపోయాడు.

* * *

డాక్టర్ని హత్య చేయడానికి పథకం వేయబడింది. దురదృష్టవశాత్తూ రావ్ది అందులో ముఖ్య పాత్ర. అతను ఏమి చెయ్యవల్సిందీ ఆదేశించబడిన తరువాత అతని కిచ్చిన ఆదేశం సరిగా నిర్వర్తించ లేకపోతే అతన్నే పూర్తి చెయ్యడానికీ, సరిగా నిర్వర్తిస్తే అంతరంగికునిగా హోదా పెంచడానికి షరతు. ఆ ఊరు వచ్చిన దగ్గర్నించీ భార్య, స్నేహితుడు, పిల్లలు గుర్తుకొచ్చి పిచ్చెత్తిపోతున్నాడు

రావ్. చెయ్యవలసిన పనిపై మనస్సు లగ్నం కావడం లేదు. ఆ ఊరు నుండి ఎంత త్వరగా వెళ్లిపోదామా అనిపించింది రావ్‌కి. ఆ రాత్రి గడవాలి. అప్పటికే సుశీల గురించి కొంత విని శేఖర్‌కి మనస్సులోనే ధన్యవాదా లర్పించుకున్నాడు

రావ్ ఇంతవరకూ చెడిన వాళ్ళనే చెరిపాడు నీతి, నిజాయితీగల వ్యక్తుల దగ్గరికి అందుకు చేరడు వాళ్ళని చూస్తే అతనికి సుశీల గుర్తుకు వస్తుంది. దానితో ఆ ఆలోచనలకే అంకితమైపోయాడు. ఆ రోజు అతను చెయ్యవలసిన పని హత్య అని తెలిపింది 'ఈ రోజుతో నా భార్యా పిల్లలకి శాశ్వతంగా దూరమైపోతున్నాను' అనుకుని, తన విధి నిర్వహణలో బయలు దేరాడు.

* * *

కటికచీకటి.... అన్యాయాలకూ, అక్రమాలకూ అనువైన అంధకారంలో నెమ్మదిగా ఆ ఇంటి వెనుక ప్రహారీగోడ గెంతి లోపల ప్రవేశించాడు రావ్. ఇంతవరకూ ఎన్ని పాపాలు చేసినా వెనుకాడని రావ్‌కు ఈ రోజు ఏందుకో ఏదో చెప్పలేని ఆవేదన కల్గుతూంది. తన చేతిలో నూరేళ్ళు నిండే ఆ అమాయిక ప్రాణి ఎవరో కదా?!.... నెమ్మదిగా అడుగులు వేస్తున్న రావ్‌కు లోపల నుండి ఏవో మాటలు వినిపించి, గదిముందు ఒక్కసారి ఆగేడు.

"ఎంత విద్యనైనా నీకు నేను చెప్పిస్తాను."

రావ్ ఎంత మారినా ఆ ధ్వనిని పోల్చే శక్తిని మాత్రం కోల్పోలేదు.

"మీ నాన్న ఎప్పుడైనా వచ్చి నిన్ను చూసి గర్వపడి మురిసిపోవాలి. ఏదో ఒక రోజు తప్పక వస్తాడు. అతను వచ్చిన మరుక్షణంలో అతనికి మిమ్మల్ని అప్పచెప్పి నేను ఎక్కడైనా పోతాను. అదే అతనికి శిక్ష. మీరు పెద్దయిన తర్వాతనైనా మీ తల్లి సుశీల సార్థకనామధేయురాలని లోకానికి చెప్పండి. అంతవరకూ ఆ అన్యాయకురాలికి ఆగవాట్లు తప్పవు, అబల, పతివ్రత . .' ఆ పైన మాటలు వినే పరిస్థితిలో లేదు రావ్. తను విన్న మాటలు, తను చంపవల్సిన వ్యక్తి 'శేఖర్' అని తెలియగానే ఇక జీవితం నిష్ప్రయోజనం అని తెల్సింది, నిస్సహా కోల్పోయే స్థితిలో తనని తనే పొడిచేసుకున్నాడు. ఆ నిస్వార్థపరుల మధ్య శేఖర్ పరిగెత్తుకొచ్చి, వెంట వెంబనే చికిత్స చేశాడు. అంతే! అన్ని ఎలా జరగాలో అలా జరిగాయి, రావ్ కోలుకున్నాడు. అన్ని మురాలు పట్టుబడ్డాయి. శేఖర్, రావ్, సుశీల, పిల్లలు దూరతీరాలకు ఎటో వెళ్ళిపోయారు

